సాక్షి
అనకాపల్లి
శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



కేశాల విరాళం

విశాఖ: హెల్త్‌సిటీలోని క్యాన్సర్ ఆస్పత్రిలో వ్యాధిగ్రస్తులకు పలువురు దాతలు తల వెంట్రుకలు విరాళంగా ఇచ్చారు.



రోడ్డు ప్రమాదం

దేవరాపల్లి-కొత్తవలస రోడ్డులో జరిగిన ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య తీవ్ర గాయలపాలైంది. 8లో



ఎయిర్ ఇండియా కొత్త సర్వీసులు

విశాఖ: ఎయిర్ ఇండియా సంస్థ ఢిల్లీ, ముంబైలకు విశాఖ నుంచి రెండు విమాన సర్వీసులు నడపనుంది. ఈనెల 13 నుంచి ప్రతిరోజూ ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి.

మాఘ పౌర్ణమి వేడుకల కోసం..

- సిద్ధమవుతున్న సముద్ర తీరాలు
- రేపు ఉదయం పుణ్యస్నానాలు ఆచరించనున్న భక్తులు
- వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు

ఎస్.రాయవరం/అచ్యుతాపురం(అనకాపల్లి): మాఘ పౌర్ణమి సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించే భక్తుల కోసం సముద్ర తీరాలను సిద్ధం చేస్తున్నారు. ఆదివారం ఉదయం పూడిమడక, రేవుపోలవరం తదితర తీరాలకు వేలాదిమంది భక్తులు తరలిరానుండడంతో వివిధ శాఖల అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పూడిమడక ఒడ్డున స్నాన ఘాట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అతి పెద్ద జాతరగా గుర్తింపు ఉన్న మాఘ పౌర్ణమి వేడుకలో భాగంగా శనివారం రాత్రి సముద్ర తీరాన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. బాణసంచా విన్యాసాలు అలరించనున్నాయి. సుమారు వారం రోజుల నుంచి జగన్నాథస్వామి ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. పూడిమడక ప్రధాన రహదారుల్లో విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రంతా జాతరను ఆస్వాదించి, ఆదివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పౌర్ణమి స్నానాలు ఆచరించడం పరిపాటి. భక్తులకు ఇబ్బందులు లేకుండా మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి నుంచి పూడిమడక వరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. అచ్యుతాపురం జంక్షన్ దాటిన తర్వాత ప్రైవేట్ వాహనాలను నియంత్రించనున్నారు. పూడిమడక హైస్కూల్ జంక్షన్ నుంచి ద్విచక్ర వాహనాలను సైతం నిలిపివేసి కాలినడకనే వీక్షకులు వెళ్లాల్సి ఉంది.



రేవుపోలవరం తీరంలో సముద్ర స్నానాలు ఆచరించే రేవు

రేవుపోలవరంలో..

మాఘపౌర్ణమి జాతరకు అధికారులు, పోలీస్ యంత్రాంగం చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. తీరంలో ప్రతి ఏడాది లక్షకు పైగా భక్తులు తరలివచ్చి సముద్ర స్నానాలు ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు సముద్రం లోనికి వెళ్లకుండా రోప్ ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లు, మెరైన్, కోస్ట్‌గార్డ్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. స్నానఘట్టాలు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. స్నానమాచరించిన భక్తులు లక్ష్మీ మాధవస్వామిని దర్శించుకునేందుకు బారికేడ్లు సిద్ధం చేశారు. జాతర రద్దీ తగ్గే వరకు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు అడ్డురోడ్డు ప్రయివేటు వాహనాలు నిలిపివేస్తున్నట్టు పోలీస్ అధికారులు తెలిపారు. అడ్డురోడ్డు నుంచి రేవుపోలవరం వరకు భక్తుల సౌకర్యార్థం రెండు వందలకు పైగా పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు సీఐ నారాయణరావు తెలిపారు. రేవుపోలవరం సమీపంలో స్వంత వాహనాలకు పార్కింగ్ సదుపాయం, బస్సులు ఎక్కేందుకు తాత్కాలిక బస్టాండ్ సదుపాయాలు కల్పించామన్నారు.



పూడిమడకలో ఏర్పాటు చేసిన విద్యుత్ సెట్టింగ్



రేవుపోలవరం తీరంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న ప్రొక్లెయిన్

మాఘ పౌర్ణమి జాతరకు ప్రత్యేక బస్సులు

నర్సీపట్నం: రేవుపోలవరం మాఘ పౌర్ణమి జాతర స్నానాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం నర్సీపట్నం డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.ఎస్.ఎస్.ధీరజ్ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి 35 బస్సులు నడుపుతున్నామన్నారు.

ఏకగ్రీవం

ఎస్.రాయవరం/పాయకరావుపేట/కోటవురట్ల: స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న మూడు స్థానాలకు శుక్రవారం జరిగిన ఎన్నికల్లో అన్నింటినీ వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. మూడుచోట్లా పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్.రాయవరం ఎంపీపీ పదవికి కోన లోవలక్ష్మి ఒక్కరే నామినేషన్ వేశారు. చిన గుమ్ములూరు ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి ప్రతిపాదించగా, ఎస్.రాయవరం-1 ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు బలపరిచారు. ప్రతిపక్షాల నుంచి పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రొసీడింగ్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి ప్రకటించారు. లోవలక్ష్మిని పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకుడు చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ , వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న తదితరులు అభినందించారు.

పాయకరావుపేట వైస్ ఎంపీపీగా మణికంఠస్వామి

పాయకరావుపేట రెండో వైస్ ఎంపీపీగా వైఎస్సార్‌సీపీ తరపున ఎన్నికైన ఎస్.నర్సాపురం ఎంపీటీసీ సభ్యుడు పల్లేల మణికంఠస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన పేరును ఎంపీపీ ఇసరపు పార్వతి ప్రతిపాదించగా, పాల్తేరు ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ బలపరిచారు. మణికంఠస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి లచ్చన్న ప్రకటించారు. స్వామిని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చింతలపూడి వెంకట్రామయ్య, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు అభినందించారు.



ఎంపీపీగా ఎన్నికైన లోవలక్ష్మిని సత్కరిస్తున్న వెంకట్రామయ్య, బొలిశెట్టి గోవిందు



పాయకరావుపేట వైస్ ఎంపీపీ మణికంఠస్వామి



కోటవురట్ల కోఆప్షన్ సభ్యుడు ఖుదా బాషా

కో ఆప్షన్ సభ్యుడిగా ఖుదా బాషా

కోటవురట్ల మండల పరిషత్‌లో కో ఆప్షన్ సభ్యుడిగా ఖుదా బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన పేరును ఎంపీటీసి సభ్యుడు పెట్ల రాంబాబు ప్రతిపాదించగా మరో ఎంపీటీసీ సభ్యుడు వంగలపూడి రాంబాబు బలపరిచారు. దీన్ని మిగతా సభ్యులందరూ ఆమోదించడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఉదయ శ్రీ ప్రకటించారు. ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు ఆర్‌ఎస్ సీతారామరాజు, చక్కా సుజాత, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 13 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. వైద్య ఆరోగ్యశాఖ, ఏపీ వైద్య విధాన పరిషత్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. క్యాథ్-ల్యాబ్ టెక్నీషియన్(2), ఆప్తాల్మిక్ అసిస్టెంట్(2), ప్లంబర్(1), ఆడియో మెట్రీ మెషిన్ కాంట్రాక్ట్(1), రేడియోగ్రాఫర్(2), స్పీచ్ థెరపిస్ట్(3), ఎలక్ట్రికల్ డెంటల్ టెక్నీషియన్(1), ఫార్మాసిస్ట్(1) పోస్టులు భర్తీ చేయనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు, విద్యార్హత ధ్రువీకరణపత్రాల జిరాక్స్ కాపీలను ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలి.

https://visakhapatnam.ap.gov.in/ను సందర్శించి దరఖాస్తుతో పాటు మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు.

న్యూస్‌రీల్

విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కు సత్కారం



విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌ను సత్కరిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక: వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి శుక్రవారం విచ్చేసిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్‌తో పాటు పలువురు సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ద్వారపురెడ్డి బాబ్జీ, పారునాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, ఉప్పులూరి నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మునగపాక గౌరీ పరమేశ్వరులను ఆనంద్‌కుమార్‌తో పాటు ప్రసాద్ దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఉత్సవ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికి సత్కరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, గౌరవ అధ్యక్షుడు పాలిమేర అప్పలనాయుడు, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు టెక్కలి కొండలరావు, పెంటకోట సత్యనారాయణ, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, పాలసంఘం అధ్యక్షుడు మళ్ల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 91 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రతి రోజూ సాయంత్రం 5.45 గంటల నుంచి పలు చిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నెల 6న జమున నటించిన..ఉండమ్మా బొట్టు పెడతా, 7న మాలపిల్ల, 8న విరాటపర్వం సినిమాలు ప్రదర్శించనున్నట్టు చెప్పారు.

జిల్లా బీసీ సంఘాల సదస్సు రేపు

అనకాపల్లి టౌన్: ఈనెల 5న జిల్లా బీసీ సంఘాల సదస్సును నిర్వహిస్తున్నట్లు ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఆడారి కుమారస్వామి చెప్పారు. స్థానిక నెహ్రూచౌక్ సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విజయ రెసిడెన్సీలో జరిగే సదస్సులో బీసీ జనగణన, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, క్రీమీలేయర్, బీసీలకు రాజ్యాధికారం తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. వివిధ సంఘాల ప్రతినిధులు కాండ్రేగుల చందు, భీశెట్టి రాము, బొడ్డేడ కిరణ్, కోనపల్లి గిరి, మళ్ల వంశీ, గణేష్ పాల్గొన్నారు.

గోదాము ఇన్‌చార్జి సస్పెన్షన్

తుమ్మపాల : యలమంచిలి, నక్కపల్లి మండలాల పౌరసరఫరాల సంస్థ గోదాముల్లో రూ.16,54,098 విలువ గల సరుకులు దుర్వినియోగం చేసినట్టు విచారణలో నిర్ధారణ అయినందున గోదాము ఇన్‌చార్జి అసిస్టెంట్ (గ్రేడ్ 1) ఎం.సత్యప్రకాష్‌ను సస్పెండ్ చేసినట్టు జేసీ కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పై మొత్తం నగదు జమ చెయ్యాలని, అతడికి రెండు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగులు ఇలాంటి అక్రమాలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆమె తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 60మందిపై కేసులు

- ఈ-చలానా ద్వారా రూ.1.13 లక్షల జరిమానాలు

అనకాపల్లిటౌన్ : జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వ్యక్తులపై, ఇసుక, గంజాయి, పశువుల అక్రమ రవాణా, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యక్తులపై గురువారం రాత్రి కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్పీ గౌతమి సాలి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టయితే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయా ప్రాంతాల ప్రజలు తెలియజేయాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించిన 60 మందిపై కేసులు, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 21 మందిపై కేసులు, ఎంవీ నిబంధనలు ఉల్లంఘించిన 505 కేసులు నమోదు చేసి ఈ చలానాగా రూ.లక్ష 13 వేల 175 జరిమానా విధించినట్లు ఆమె చెప్పారు.

ఐదుగురికి విదేశీ విద్యాదీవెన



విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన చెక్కు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- రూ.49.5 లక్షల ఆర్థిక సాయం

తుమ్మపాల: పేద విద్యార్థులు కూడా విదేశాలలో చదువుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం విదేశీ విద్యకు దరఖాస్తు చేసిన ఐదుగురు విద్యార్థులకు రూ.49.5 లక్షల చెక్కు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలోనైనా ఉన్నతమైన క్యూ.ఎస్.ర్యాంకు కలిగిన విశ్వవిద్యాలయం, విద్యాసంస్థల్లో పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులను అభ్యసించవచ్చన్నారు. ఏడాదికి ఎనిమిది లక్షల రూపాయల లోపు ఆదాయం కలిగిన బీసీ, ఈబీసీ, కాపు విద్యార్థులు ప్రతి ఏటా రెండు పర్యాయాలు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. నర్సీపట్నానికి చెందిన కాళ్ల ఉదయమిత్ర ఆస్ట్రేలియాలో మాస్టర్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివేందుకు రూ.11,36,700, మాడుగుల మండలం రొంగళినాయుడుపాలెం గ్రామానికి చెందిన జూరెడ్డి గంగా సూర్యప్రసాద్ యూకేలో అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ అండ్ సిస్టమ్ మేనేజిమెంట్ చదివేందుకు రూ.6,52,610, అనకాపల్లి గాంధీనగరానికి చెందిన చొప్ప లిఖిత ఎంబీబీఎస్ చదివేందుకు రూ.3,57,000, ఈబీసీ కేటగిరీలో కొల్లి సూదీపకు రూ.24,91,347, ఎస్సీ కేటగిరీలో బొడ్డు దీనరేచల్ కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ చదివేందుకు రూ.3,00,200 విడుదల చేసినట్లు తెలిపారు. అంతకుముందు తాడేపల్లిలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న జగనన్న విదేశీ విద్యాదీవెన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు వర్చువల్‌గా వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డీడీ కె.రాజేశ్వరి, సోషల్ వెల్ఫేర్ డీడీ అజయ్‌బాబు, ఏబీసీడబ్ల్యూవో సురేష్ పాల్గొన్నారు.

బెల్లం రైతులకు మద్దతు

- సీఎంతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటాం
- సంవత్సరమంతా పనులు జరిగేలా స్టోరేజి నిర్మాణం
- మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే హామీ

అనకాపల్లి టౌన్: బెల్లం రైతులకు మద్దతు ధర వచ్చే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్‌పాండే చెప్పారు. ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 కేజీల బెల్లానికి కనీస మద్దతు ధర రూ.5 వేలు వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. నల్లబెల్లం సమస్యను ఎక్సైజ్‌శాఖ ఉన్నతస్థాయి అధికారులతో చర్చించి సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కొలగార్లకు, కలాసీలకు ఏడాదికి ఆరు మాసాలు మాత్రమే పని ఉంటోందని, మార్కెట్ యార్డులో పూర్తి స్థాయిలో బెల్లం స్టోరేజీలు ఏర్పాటు చేసి నిత్యం పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన యార్డులో అన్ని బ్లాక్‌లను పరిశీలించి, బెల్లం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, రవి దంపతులు రాహుల్‌పాండేకు బెల్లం దిమ్మను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ ఎర్రన్న, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోటయ్య, జిల్లా మేనేజర్ అరుణ, మార్కెట్ యార్డు కార్యదర్శి శకుంతల, మార్కెట్ కమిటీ మెంటర్లు, అధికారులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డులో బెల్లం దిమ్మలను పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్‌పాండే

తిరుపతి లడ్డూ తయారీకి సేంద్రియ బెల్లం



సేంద్రియ బెల్లాన్ని పరిశీలిస్తున్న రాహుల్ పాండే

కోటవురట్ల: తిరుపతి లడ్డూ తయారీకి సేంద్రియ బెల్లం ఉపయోగించాలని యోచిస్తున్నట్లు రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఎండీ, మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే తెలిపారు. శుక్రవారం ఆయన రాజుపేటలో సేంద్రియ బెల్లం తయారీ పరిశ్రమను సందర్శించారు. ఇక్కడ బెల్లం తయారు చేసే విధానం, పాడవకుండా చేపట్టే చర్యలు, జాగ్రత్తలను పరిశ్రమ యజమాని వేగి శ్రీనివాసరావు అధికారులకు వివరించారు. విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నామని వివరించారు. ఈ బెల్లాన్ని పరిశీలించిన అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. తొలివిడతగా ఈ ఏడాది 150 టన్నుల బెల్లం కొనుగోలు చేయనున్నట్లు మార్కెటింగ్ అధికారులు తెలిపారు. రైతు సాధికార సమితి డీపీఎం లచ్చన్న, మార్కెటింగ్ అధికారులు ఉన్నారు.

వాల్తేర్ డివిజన్‌కు రికార్డు కేటాయింపులు

- బడ్జెట్‌లో అధిక నిధుల కేటాయింపు
- డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి వెల్లడి



తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వేకు అగ్రస్థానం లభించింది. వాల్తేర్ డివిజన్‌కు రికార్డు కేటాయింపులు చేశారని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా రాష్ట్రాలకు కేటాయించిన కేటాయింపుల వివరాలు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.2800 కోట్లు కంటే ఎక్కువ వాల్తేర్ డివిజన్‌కు కేటాయించారని, ఇది కాకుండా సంయుక్త పనుల నిమిత్తం ఈస్ట్‌కోస్ట్‌రైల్వేకు మరో రూ.1,700 కోట్లు కేటాయించినట్లు డీఆర్‌ఎం తెలిపారు.

ట్రాఫిక్ సదుపాయాలు

డివిజన్ పరిధిలో గల ట్రాఫిక్ సదుపాయాలైన యార్డ్ మోడలింగ్, ఇతర పనులకు కింద విధంగా కేటాయింపుల చేశారు. దీనికి గాను రూ.51.13 కోట్లు కేటాయించారు. రహదారి భద్రతా విభాగాలకు గాను లెవెల్ క్రాసింగ్స్‌కు, రోడ్ అండర్ బ్రిడ్జిలు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలకు గాను సుమారు రూ.17.45 కోట్లు, ట్రాక్ రెన్యూవల్స్‌కు రూ.261కోట్లు, బ్రిడ్జి పనులకు రూ.9.93కోట్లు, సిగ్నల్ అండ్ టెలికంకు రూ.30.84 కోట్లు కేటాయించారు. వర్క్‌షాప్‌లు, నిర్మాణ యూనిట్‌లలో భాగంగా విశాఖలోని ఎలక్ట్రికల్ లోకో షెడ్‌కు రూ.20 లక్షలు, షెడ్ ఎక్స్‌టెన్షన్‌కు, ఇతర సదుపాయాలకు రూ.1.10 కోట్లు, సిబ్బంది సంక్షేమంలో భాగంగా క్వార్టర్స్ ఆధునికీకరణ, మరమ్మతులకు రూ. 15లక్షలు కేటాయించారు.

వాల్తేర్ డివిజన్‌కు బడ్జెట్ కేటాయింపులు

- వాల్తేర్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న కొత్త లైన్లకు రూ. 285 కోట్లు కేటాయించారు. వీటిలో ముఖ్యంగా జైపూర్-మల్కన్‌గిరి, జైపూర్-నవరగంపూర్, నౌపడ-గుణుపూర్ బ్రాడ్‌గేజ్ లైన్లు ఉన్నాయి.
- డబ్లింగ్ (రెండో లైన్) పనులకు రూ.2,185 కోట్లు
- కిరండూల్-జగదల్‌పూర్‌కు రూ.135 కోట్లు
- జగదల్‌పూర్ -కోరాపుట్‌కు రూ.170 కోట్లు
- విజయనగరం-సంబల్‌పూర్ మూడోలైన్‌కు రూ.920 కోట్లు
- కొత్తవలస-కోరాపుట్‌కు రూ.410 కోట్లు
- కోరాపుట్ - సింగపూర్ రోడ్‌కు రూ. 550 కోట్లు

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు...

విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్, కొత్త రాయగడ డివిజన్‌కు కలిపి రూ.10 కోట్లు మాత్రం కేటాయించారు.

ఉత్తరాంధ్ర మదిలో కళాతపస్వి



విశాఖ కళాభారతిలో విశ్వనాథుడికి సన్మానం



శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో విశ్వనాథ్‌కు స్వర్ణ పుష్పార్చన చేస్తున్న అధినేత నర్సింహారావు

నక్కపల్లి/పాయకరావుపేట/కొమ్మాది/మద్దిలపాలెం: నటుడు, దర్శకుడు, రచయిత కళాతపస్వి కె.విశ్వనాథ్ జ్ఞాపకాలు ఉత్తరాంధ్ర ప్రజల మదిలో ఎప్పటికీ పదిలం. విశాఖలో ఆయన చిత్రీకరించిన ఎన్నో సినిమాలు మంచి విజయం సాధించాయి. విశాఖపై మక్కువతో అనేక చిత్రాల్లో యారాడ నుంచి భీమిలి బీచ్ వరకు ఎన్నో సుందర ప్రదేశాలను ఆయన తెరకెక్కించారు. మత్స్యకారుల జీవన విధానం ఉట్టిపడేలా తెరకెక్కించిన శుభసంకల్పం సినిమా ఓ అద్భుతం. ఆ సినిమాను భీమిలి తోటవీధిలో మత్స్యకారుల నివాసాల మధ్య కమల్‌హాసన్, ఆమని, ప్రియారామన్‌లకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను విశ్వనాథ్ చిత్రీకరించారు. చలం శౌరీస్ ఆశ్రమంలో రాజశేఖర్, సుమలత నటించిన శృతిలయలు సినిమా షూటింగ్ చేశారు. స్వర్ణకమలం, స్వాతిముత్యం వంటి సూపర్ హిట్ సినిమాలు వైజాగ్ తాజ్ హోటల్, అప్పికొండ, ఆర్.కె బీచ్, భీమిలి బీచ్ ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకున్నాయి. ఆయన చివరిగా దర్శకత్వం వహించిన శుభప్రదం సినిమాలోని పలు సన్నివేశాలు ఉపమాక వేంకటేశ్వరాలయం పరిసరాల్లో చిత్రీకరించారు. 2012లో కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారాన్ని ఆయన విశాఖలో స్వీకరించారు. 2017 జూన్ 28న కళాభారతిలో ఆయనకు ఘన సన్మానం చేశారు.

విశ్వనాథుడికి స్వర్ణ పుష్పార్చన

కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు శ్రీప్రకాష్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పాయకరావుపేటలో ఘన సన్మానం జరిగింది. 2007లో ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో అల్లరి నరేష్ హీరోగా శుభప్రదం సినిమా షూటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

అదే సమయంలో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థ నిర్వాహకులు ప్రతి ఏటా నిర్వహించే జోష్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వనాథ్‌ను ఆహ్వానించారు. ఆయనను విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె.నర్సింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ తదితరులు స్వర్ణపుష్పాలతో సన్మానించారు.

అష్టలక్ష్మి ఆలయ దర్శనం

కొమ్మాది శ్రీ అష్టలక్ష్మి ఆలయంలోని లక్ష్మీ నారాయణ స్వామిని కె.విశ్వనాథ్ 2015 నుంచి 2017 వరకు వరసగా దర్శించుకున్నారని ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. 2010లో శుభప్రదం ఆడియో ఫంక్షన్ పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 2012లో వీఎంఆర్డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో యాక్మీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన గొల్లపూడి మారుతీరావు 72వ జన్మదిన వేడుకలకు కె.విశ్వనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

World Cancer day - Advt Feature

క్యాన్సర్ నివారణ సాధ్యమే.. ఎలా అంటే!

– డాక్టర్ రవిశంకర్
ప్రముఖ అంకాలజిస్ట్, ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్


డా॥ బి.రవిశంకర్ (అంకాలజిస్ట్)
MD (CMC Vellore) DNB (RT)
MRCP, ECMO (Med. Onc)
FESTRO (Rad Onc.) PDCR, OCTT, MBA
Managing Director: OMEGA Hospitals

ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యమిస్తూ.. మంచి ఆహారం, శారీరక వ్యాయామాలు అలవాటు చేసుకోవడంతోపాటు, హాని కారకాలు, కాలుష్య కారకాలకు దూరంగా ఉండటం ద్వారా క్యాన్సర్ నివారణ సాధ్యమే. క్యాన్సర్ ప్రాణం తీసే మహమ్మారి. కాకపోతే తొలి రెండు దశల్లోనే దీన్ని గుర్తించాలి. మూడు, నాలుగో దశలకు వెళ్లిందంటే ప్రాణాలకు రిస్క్ తెచ్చుకున్నట్లు అవుతుంది. ముఖ్యంగా నాలుగో దశకు మహమ్మారి విస్తరిస్తే దాన్నుంచి బయటపడటం చాలా కష్టం. అందుకే ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌ను మొగ్గలోనే తుంచివేసేందుకు ప్రయత్నించాలి. మధ్య వయసు దాటిన తర్వాత ఏడాది, రెండేళ్లకోసారి కేన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవడం మెరుగైన మార్గం అవుతుంది. క్యాన్సర్‌కు తీసుకునే చికిత్సలతో ఎన్నో దుష్ప్రభావాలు ఉంటాయి. అంటే చికిత్సా సమయంలో ఎన్నో ఇబ్బందులను అధిగమించాలి, అంత ఇబ్బంది రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తలే మేలైన మార్గం. క్యాన్సర్ మహమ్మారి ఏటా ప్రపంచవ్యాప్తంగా 1.9 కోట్ల మందికి సోకుతుంటే, ఏటా కోటి మంది మరణిస్తున్నారు. వీటిల్లో 30–50 శాతం కేసుల్లో క్యాన్సర్ నివారించతగ్గ స్థాయిలోనివేనని వైద్య నిపుణులు చెబుతున్నారు.

క్యాన్సర్‌ను జన్యు సంబంధ, జీవన శైలి, పర్యావరణ అంశాలు ప్రభావితం చేస్తాయి. క్యాన్సర్‌కు దారితీసే అంశాలలో పొగాకు అలవాటు ఒకటి. ఆల్కహాల్ రెండోది. వీటికి దూరంగా ఉంటే హెడ్ క్యాన్సర్, నెక్ క్యాన్సర్, లంగ్ క్యాన్సర్, లివర్ క్యాన్సర్, బ్లాడర్ క్యాన్సర్‌ను నివారించొచ్చు. శరీర బరువు నియంత్రణ చాలా ముఖ్యమైనది. స్థూలకాయం క్యాన్సర్‌కు కూడా కారణమవుతుందన్నది వైద్యుల హెచ్చరిక. కనుక బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ)ను 18.5–24.9 మధ్య కట్టడిచేయాలి. ఆహారంలో పండ్లు, కూరగాయలు కలిపి మూడింట రెండొంతుల పరిమాణాన్ని తీసుకోవాలి. మిగిలిన ఒక భాగం కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే రైస్ వంటి వాటికి చోటు ఇవ్వొచ్చు. కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు ఉండే ముడి ధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పీచు ఉండే పదార్థాలు మంచివి. రోజువారీ శారీరక వ్యాయామాలు చేయాలి. శారీరక కదలికలు లోపించిన వారికి కేన్సర్ రిస్క్ పెరుగుతున్నట్లు పరిశోధకులు ఇటీవలి అధ్యయనాల్లో గుర్తించారు. రోజులో అరగంట నుంచి గంటకు మించి సూర్యరశ్మికి ఎక్కువగా ఎక్స్‌పోజ్ కాకూడదు. లేదంటే చర్మ క్యాన్సర్ రిస్క్ పెరుగుతుంది. కార్సోజెనిక్ ఉండే ఆస్బెస్టాస్, క్రోమియం, కాడ్మియం, సిలికా దుమ్ము, సల్ఫర్‌కు ఎక్స్‌పోజ్ కాకూడదు. కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాలకు వెళ్లే సమయంలో మంచి ప్రొటెక్టివ్ మాస్క్ ధరించాలి. కొంత మందిలో క్యాన్సర్ వృద్ధి చెందేందుకు అనుకూల జన్యువులు ఉంటాయి. వారి ద్వారా పిల్లలకు కూడా బదిలీ అవుతాయి. ఇలాంటి వారు ముందస్తుగా స్క్రీనింగ్, జన్యు పరీక్షలు చేయించుకోవడం ద్వారా రిస్క్‌పై అంచనాకు రావచ్చు. మహిళలు అయితే హ్యూమన్ ప్యాపిలోమా వ్యాక్సిన్ తీసుకోవాలి. దీంతో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించొచ్చు. హెపటైటిస్ బి వ్యాక్సిన్ తీసుకుంటే లివర్ క్యాన్సర్ రిస్క్ తగ్గుతుంది.

మహిళల్లో రొమ్ము క్యాన్సర్ మరణాలు ఎక్కువే

ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో అత్యధికంగా వచ్చేది రొమ్ము క్యాన్సరే. అంతగా అభివృద్ధి చెందని దేశాల్లో మొత్తం మరణాల్లో దాదాపు 1.6 శాతం రొమ్ము క్యాన్సర్ వల్లనే సంభవిస్తున్నాయి. మనదేశంలో ప్రతి 28 మంది మహిళల్లో ఒకరు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారంటే దీని తీవ్రత ఎంతో తెలుసుకోవచ్చు. పల్లెల్లో ప్రతి 60 మందిలో ఒకరు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతుండగా, నగరాల్లో ప్రతి 22 మందిలో ఒకరు దీనికి గురవుతున్నారు. వయసు పెరిగే కొద్దీ ఆధునిక జీవనశైలిలో వచ్చే మార్పులతో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. బిడ్డ పుట్టాక తల్లులు కనీసం ఆర్నెల్లు/ ఏడాది పాటైనా బిడ్డకు రొమ్ము పాలు పట్టించాలి. మహిళల్లో వచ్చే హార్మోన్ మార్పులు కూడా రొమ్ము క్యాన్సర్‌కు కారణం కావచ్చు. 30 ఏళ్ల తర్వాత సంతానం కలిగేవారు, పిల్లలు లేని మహిళలు, పాశ్చాత్య దేశవాసులతో పోలిస్తే మన దేశ మహిళల్లో ఉండే జన్యుపరమైన అంశాలు కూడా దోహదం చేస్తున్నాయి. రొమ్ము క్యాన్సర్‌ను తేలిగ్గా గుర్తించవచ్చు. తమలో అంతకు ముందు కనిపించని గడ్డలు స్పర్శకు తెలుస్తున్నప్పుడు, అవి నొప్పిగా లేనప్పుడు మహిళలు వాటిని నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి.
సెల్: 9849123256.

ADVT

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


గృహసారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ కళ్యాణి, హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే గణేష్


హాజరైన సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు

నర్సీపట్నం: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగాపని చేయాలని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి పేర్కొన్నారు. శుక్రవారం నర్సీపట్నంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అధ్యక్షతన జరిగిన సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. పార్టీకి బలమైన వ్యవస్థ ఉన్నందున 2024లో జరగబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98.2 శాతం నెరవేర్చిన దేశంలో ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఏ సీఎం చేయని సాహసోపేత నిర్ణయం తీసుకుని ఎమ్మెల్యేలను ప్రజల్లోకి పంపుతున్న దమ్ము ఉన్న నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. మనం ఇచ్చిన హామీలు నెరవేర్చాం కాబట్టే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి ఓటు అడగగలమన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. జగనన్న ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర జిల్లా సచివాలయాల కోఆర్డినేటర్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి గడపకు తీసుకువెళ్లాలన్నారు. గృహసారథులకు 200 రకాల సామగ్రితో కిట్లు అందిస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ రానున్న కాలం చాలా విలువైందన్నారు. పార్టీ నాయకత్వంతో పాటు వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు పార్టీ కోసం శ్రమించాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ, హర్షవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యే సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. గృహసారథులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ సాగిన లక్ష్మణ్‌మూర్తి, వైస్ఎంపీపీ పైల సునీల్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 15 టీడీపీ కుటుంబాలు

- ఎం. అలమండలో తెలుగుదేశం పార్టీకి గట్టి షాక్


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: మండలంలోని ఎం. అలమండ గ్రామానికి చెందిన బలమైన 15 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. తారువ క్యాంప్ కార్యాలయంలో వీరికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రొంగలి వాసుదేవరావు, కామిరెడ్డి రమణ, యర్ర తాతయ్యలు, సిరికి సింహాద్రప్పడు, సూరెడ్డి తాతయ్యలు, గండిబోయిన భవానీ, దేముడమ్మ, పోతల శ్రీను తదితరులు ఉన్నారు. గట్టి పట్టున్న వీరంతా వైఎస్సార్‌సీపీలో చేరడంతో ఎం. అలమండలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ పాలన తమను ప్రభావితం చేశాయని పార్టీలో చేరిన వారు స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాలన్నీ అభివృద్ధి చేయడం పట్ల తాము ఆకర్షితులం అయ్యామన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నాయకత్వంలో పార్టీ బలోపేతానికి, విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక సర్పంచ్ దాడి జగన్, మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీ శంకర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద గిరిజనులపై సర్వత్రా ప్రశంసలు

- బోడిగరువులో పాఠశాల నిర్మాణానికి సొంత స్థలం దానం
- సుమారు రూ. 2 లక్షల విలువైన 15 సెంట్లు అప్పగింత


సర్పంచ్ బోడెమ్మ సమక్షంలో విద్యాశాఖ అధికారులకు స్థల దాన పత్రాలను అందజేస్తున్న గిరిజనులు

దేవరాపల్లి: ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి నిరుపేద గిరిజనులు తమ సొంత స్థలాన్ని దానం చేసి ఉదారత చాటుకున్నారు. చింతలపూడి పంచాయితీ శివారు నేరెళ్లపూడిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను నేరేళ్లపూడికి మార్పు చేసేందుకు రెండు గ్రామాల ప్రజలు అంగీకారం కుదుర్చుకున్నారు. నేరెళ్లపూడికి వెళ్లేందుకు రహదారి సక్రమంగా లేకపోవడంతో రాకపోకలకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే రెండు గ్రామాలకు ప్రజలు కలిసి బోడిగరువులో పాఠశాల నిర్మించాలని నిర్ణయించుకున్నారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సమకూర్చేందుకు స్థానిక గిరిజనులు ముందుకు వచ్చారు. బోడిగరువు గ్రామానికి చెందిన పోయిరి ఈశ్వరరావు–8 సెంట్లు, పోయిరి గంగులు–7 సెంట్లు దానం చేశారు. ఈ స్థలదాన పత్రాలను స్థానిక సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, ఎంపీటీసీ బండి గౌరమ్మ, ఉప సర్పంచ్ గలేరి గంగరాజు చేతుల మీదుగా విద్యాశాఖ అధికారి సీహెచ్ రవీంద్రబాబుకు అందజేశారు. సుమారు రూ. 2 లక్షల విలువ చేసే స్థలాన్ని దానం చేసిన గిరిజనులపై స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు విద్యాశాఖ అధికారులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వెల్ఫేర్ అసిస్టెంట్ రాజా, సీఆర్పీ ఆదిరెడ్డి ఈశ్వరరావు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆదిబాబు, పోయిరి రాము తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఉద్యోగి సస్పెన్షన్


సస్పెన్షన్‌కు గురైన వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సూర్య నారాయణమూర్తి

రోలుగుంట: మండలం కుసుర్లపూడి సచివాలయంలో ఎడ్యుకేషన్‌వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎల్. సూర్యనారాయణమూర్తి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో అధికారుల విచారణ మేరకు సస్పెండ్ అయ్యారు. గత ఏడాది సెప్టెంబర్ 5న రొంగల రామునాయుడు సూర్యనారాయణమూర్తిపై సంక్షేమ పథకాల మంజూరుకు సంబంధించి పక్షపాతం చూపిస్తున్నాడని.. అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు విధులు కూడా నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు చేశారు. అలాగే గత ఏడాది నవంబర్‌లో రొంగలపాలెం సర్పంచ్ రెడ్డి లోవరాజు ఒక వర్గం వారికే సంక్షేమాలు మంజూరు చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని గండి కొట్టిస్తున్నాడని గత ఏడాది నవంబర్ 15న స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో ఆధార్ కార్డులో వయస్సులు మార్పించి పింఛన్లు, చేయూత పథకాలను తనకు నచ్చిన వారితో దరఖాస్తు చేయించి నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నర్సీపట్నం డీఎల్‌డీవో దీనిపై విచారించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. విచారణాంశాలు పూర్తిస్థాయిలో పరిశీలించిన అధికారులు సూర్యనారాయణమూర్తిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో ప్రభాకరరావు విలేకరులకు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు గాయాలు


చికిత్స పొందుతున్న లక్ష్మణ, సంజీవరావు


మృతి చెందిన సన్నిబాబు


గాయాలపాలైన సన్నిబాబు భార్య

దేవరాపల్లి : దేవరాపల్లి–కొత్తవలస రోడ్డులో చిన్న గుడిపాల జంక్షన్ వద్ద జీపు రెండు ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య తీవ్ర గాయలపాలైన విషాద ఘటన చోటు చేసుకుంది. ఇదే ప్రమాదంలో మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడు సహా ముగ్గురు క్షతగాత్రులు వేపాడ మండలానికి చెందినవారు. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ డి. నాగేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపాడ మండలం చినగుడిపాలకు చెందిన భార్యభర్తలు బాలిబోయిన సన్నిబాబు, దేముడమ్మ ద్విచక్ర వాహనంపై దేవరాపల్లి వైపు వస్తున్నారు. చినగుడిపాల జంక్షన్ వద్ద దేవరాపల్లి వైపు మలుపు తిరుగుతుండగా దేవరాపల్లి నుండి ఆనందపురం వైపు వెళ్తున్న జీపు బలంగా ఢీకొట్టింది. అదే సమయంలో ఆనందపురం వైపు నుండి ద్విచక్ర వాహనంపై వస్తున్న వేపాడ మండలం భర్తవానిపాలెంకు చెందిన గండి సంజీవరావు, సిహెచ్.లక్ష్మణను సైతం జీపు ఢీకొట్టింది. దీంతో ఆ రెండు వాహనాలపై ఉన్నవారంతా తీవ్ర గాయాలతో చెల్లాచెదురుగా పడిపోయారు. వారిని స్థానికులు 108 వాహనంలో కె.కోటపాడు కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన చిన్నగుడిపాలకు చెందిన బాలిబోయిన సన్నిబాబు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సన్నిబాబు భార్య దేముడమ్మ కాలు, చెయ్యి విరిగిపోవడంతో స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజిహెచ్‌కు తరలించారు. భర్తవానిపాలేనికి చెందిన సంజీవరావు, లక్ష్మణకు తీవ్ర గాయాలయ్యాయి. తన కళ్ల ముందే భర్త మృతి చెందడంతో తీవ్ర గాయాలతో ఉన్న భార్య దేముడమ్మ కన్నీరు మున్నీరుగా విలపించింది. ప్రమాదానికి కారణమైన జీపు డ్రైవర్ పరారవగా, జీపు అనంతగిరి మండలం కివర్ల శివారు తంగిడి బంద గ్రామానికి చెందినదిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు ఎస్‌ఐ డి. నాగేంద్ర సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదానికి కారణాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహానికి అనకాపల్లి ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు.

శభాష్ వలంటీర్...


ఏలూరులో చికిత్స పొందుతున్న నారాయణమ్మకు పింఛన్ అందజేస్తున్న రూప

మునగపాక: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ మంచి ఫలితాలు సాధిస్తుంది. సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా పలువురు వలంటీర్లు సేవలందిస్తున్నారు. మండలంలోని గణపర్తి గ్రామానికి చెందిన వలంటీర్ కోరిబిల్లి రూప మానవత్వం చాటుకుంది. గణపర్తికి చెందిన జాజుల నారాయణమ్మ కాలికి గాయం కావడంతో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్నారు. దీంతో నారాయణమ్మకు ఏలూరు వెళ్లి వలంటీర్ రూప ఈ నెల పింఛన్ సొమ్ము అందజేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వృత్తి పట్ల అంకితభావంతో సేవలందించిన రూప ఆదర్శం కావాలని పలువురు కోరుతున్నారు.

పోసానికి అభినందన


పోసానిని సన్మానిస్తున్న సినీ నటుడు జోగినాయుడు

నాతవరం: రాష్ట్ర చలన చిత్ర, టెలివిజన్, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా శుక్రవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించిన నటుడు పోసాని కృష్ణ మురళిని సినీనటుడు లోకారపు జోగినాయుడు అభినందించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి సినిమా ఆరిస్టుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని అన్నారు.

నాలుగు ఆలయాల్లో హుండీలు చోరీ


దిబ్బిడిలో ఆంజనేయస్వామి గుడిలో విచారణ చేస్తున్న పోలీసులు

బుచ్చెయ్యపేట : మండలంలో మూడు గ్రామాల్లో నాలుగు ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు హుండీలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో ఆంజనేయస్వామి, మోదకొండమ్మ, దిబ్బిడిలో ఆంజనేయస్వామి, కొండపాలెంలో ఆంజనేయస్వామి ఆలయాల్లో హుండీలు పగలగొట్టి నగదు దోచుకుపోయారు. నాలుగు ఆలయాల్లో సుమారు రూ. 30 వేలకు పైగా నగదును దొంగలు దోచుకున్నట్లు గ్రామస్తులు తెలియజేస్తున్నారు. శుక్రవారం ఉదయం మూడు గ్రామాల్లో హుండీలు పగలగొట్టి ఉండడాన్ని ఆయా గ్రామాల ప్రజలు గుర్తించారు. ఆలయాల్లో దొంగతనాలపై ఆయా గ్రామ నాయకులు బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, ఎస్‌ఐ కుమారస్వామి సంఘటన స్థలాల్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి విచారణ చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడ్డ చిన్నారావు, దేవుడు

నక్కపల్లి : మండలంలో జాతీయ రహదారిపై నక్కపల్లి వారపు సంత వద్ద వ్యాన్ ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం వారపు సంత కావడంతో నర్సీపట్నం మండలం చినబొడ్డేపల్లికి చెందిన కాళ్ల చిన్నారావు, సింగంపల్లి దేముడులు సంతలో పుచ్చకాయలు విక్రయించేందుకు వచ్చారు. సంత సమయం ముగియడంతో సరుకుని సర్దుకుని ఇంటికి ప్రయాణమయ్యేందుకు సిద్ధ పడుతుండగా విశాఖ నుంచి తుని వైపు వెళ్లే వ్యాన్ ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేడు వేల్పుల వీధి చాకలిపేటలో 'గడప గడపకు..'

అనకాపల్లిటౌన్: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని స్థానిక వేల్పులవీధి చాకలిపేటలో శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు 83వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు జాజుల ప్రసన్నలక్ష్మి తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

పడమటమ్మ తీర్థ మహోత్సవం రేపు

కశింకోట: కశింకోటలోని కస్పావీధిలో కొలువుదీరిన పడమటమ్మ తీర్థ మహోత్సవాన్ని ఈ నెల 5న జరపనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద మధ్యాహ్నం ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కస్పావీధి నుంచి అమ్మ వారి ఆలయం వరకు కోలాటాలు, భజనలు, తోడపెద్దు సేవతో ఊరేగింపు ఉంటుందని తెలియజేశారు.

అభ్యంతరాలున్న చోట మళ్లీ భూముల సర్వే

కశింకోట: మండలంలోని 22 రెవెన్యూ గ్రామాల్లోని భూముల రీ–సర్వేలో అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కరించడానికి శుక్రవారం మళ్లీ సర్వే ప్రారంభించామని తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు తెలిపారు. భూముల రీ సర్వే సవ్యంగా జరగలేదని విచారణలో వెల్లడైన నేపథ్యంలో, అభ్యంతరాలు ఉన్న చోట మళ్లీ సర్వే జరపాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలియజేశారు. ఈ మేరకు సచివాలయాల్లో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. వారు రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి, పరిష్కార చర్యలు చేపట్టనున్నారన్నారు. రైతులు సహకరించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తుప్పల తొలగింపు



తుప్పలు తొలగించి శుభ్రం చేస్తున్న కూలీలు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం గ్రామం నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డును పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం శుభ్రపరిచారు. ఈ సందర్భంగా రోడ్డుకు రెండు వైపులా ఉన్న తుప్పలను తొలగించి శుభ్రం చేస్తున్నారు. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

అనకాపల్లి సినిమాలు

మైఖేల్	- రాజా
బుట్ట బొమ్మ	- సత్యనారాయణ స్క్రీన్-1
పఠాన్	- సత్యనారాయణస్క్రీన్-2
రైటర్ పద్మభూషణ్	- షిర్డిసాయి
పఠాన్	- పర్తిసాయి
వీరసింహారెడ్డి	- వెంకటేశ్వర
హంట్	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 8,066 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,600	4,200
మొదటి రకం	3,300	3,650
రెండో రకం	2,960	3,470
మూడో రకం	2,800	3,050

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–12 యూనిట్లు, బీ పాజిటివ్–7 యూనిట్లు, బీ నెగెటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్ 10 యూనిట్లు, ఓ నెగెటివ్–4 యూనిట్లు, ఏబీ పాజిటివ్ –3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్యను 91828 34480 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 325 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 94411 08144)ని సంప్రదించవచ్చు.

ఉపాధి హామీలో అక్రమాలకు చెక్

- ఆధార్‌తో జాబ్‌కార్డుల అనుసంధానం
- మండలంలో 23,352 జాబ్ కార్డులు
- ఇప్పటి వరకు 20,497 మందికి లింక్
- త్వరితగతిన పూర్తి చేసేందుకు స్పెషల్ డ్రైవ్



ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వేతనదారులు

అనకాపల్లి రూరల్: గ్రామాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రూపొందించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సంకల్పించింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సాఫ్ట్‌వేర్ ద్వారా పనులు చేపట్టేవారు. జాతీయ స్థాయిలో ఒకే సాఫ్ట్‌వేర్ ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పనుల నిర్వహణకు గతేడాది నూతన సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టింది. దీంతో అప్పటి నుంచి ఉపాధి హామీ పనుల్లో ప్రక్షాళనలు జరుగుతున్నాయి. అంతేకాకుండా కూలీల ఆధార్‌కార్డుతో జాబ్ కార్డులను అనుసంధానం చేస్తోంది. ఈ ప్రక్రియను డ్వామా అధికారులు చేస్తున్నారు.

ఒక కుటుంబానికి ఒకే జాబ్ కార్డు

ఉపాధి హామీ పథకం అమలును పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్రం ఆధార్ అనుసంధానం చేయాలని ఆదేశించింది. ఒక కుటుంబానికి ఒక జాబ్ కార్డును మాత్రమే ఇస్తున్నారు. ఈ పథకంలో కూలీలకు 2006లో జాబ్ కార్డులను జారీ చేశారు. ఆ సమయంలో ఒక కుటుంబం పేరిట రెండు జాబ్ కార్డులు సైతం నమోదయ్యాయి. తద్వారా పథకంలో అనేక అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి.అంతే కాకుండా ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్నవారికి సైతం జాబ్ కార్డులు ఉండటం, ఒక్కొక్కరికి రెండుచోట్ల జాబ్ కార్డులు ఉండటం, కొన్ని చోట్ల జాబ్ కార్డులో ఒక పేరు.. ఆధార్ కార్డులో మరో పేరు ఉండటంతో వేతన చెల్లింపుల్లో అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఆధార్ కార్డుతో జాబ్ కార్డులను లింక్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియ పూర్తయితే ఉపాధి హామీ పథకంలో బినామీలు, డూప్లికేట్లకు చెక్ పడనుంది.

87.77శాతం పూర్తి

ఉపాధి హామీ పథకంలో లక్షలాది మంది వేతనదారులు ప్రతీ ఏటా పనిచేస్తున్నారు. అర్హత గల వేతనదారులకు మాత్రమే ప్రభుత్వం ఈ పథకం ద్వారా పని కల్పించాలన్న లక్ష్యంతో వుంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం అమలవుతోంది. వేతనదారులకు పని కల్పన, పండ్ల తోటల అభివృద్ధి, అవెన్యూ ప్లాంటేషన్ తదితర కార్యక్రమాల కింద పని కల్పిస్తున్నారు. అనకాపల్లి మండలంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి 23,352 జాబ్ కార్డులున్నాయి. వీటి పరిధిలో సుమారు 24 వేలమందికి పైగా వేతనదారులున్నారు. వీరి జాబ్‌కార్డులతో ఆధార్ వివరాలను లింక్ చేస్తున్నారు. మండలంలో ఇంతవరకూ 20,497 మందికి (87.77శాతం) ఆధార్ అనుసంధానం పూర్తయింది. మిగిలిన వారి వివరాలను కూడా అనుసంధానం చేసేందుకు మండల స్థాయి అధికారులు శ్రమిస్తున్నారు.

బినామీలకు చెక్

జాబ్‌కార్డుతో ఆధార్ అనుసంధానం చేయడం వల్ల అర్హులైన వేతనదారులు ఎవరో తెలుస్తుంది. డూప్లికేట్ కార్డులుంటే తొలగిపోతాయి. ముఖ్యంగా బినామీ కార్డులనేవి ఉండవు. కొంతమంది సిబ్బంది బినామీ కార్డులు సృష్టించి అక్రమంగా లబ్ధి పొందుతున్నారు. ప్రజా వేదిక సమయంలో ఇలాంటి బినామీ వ్యవహారాలు బయటపడుతున్నాయి. ఆధార్ అనుసంధానం వల్ల ఇకపై ఆ పరిస్థితి ఉండదు. జాబ్‌కార్డుకు ఆధార్‌తో అనుసంధానమైన వారికి మాత్రమే ఉపాధి హామీ పథకంలో పని కల్పిస్తారు.

పారదర్శకంగా అమలు చేసేందుకే..



ఉపాధి హామీ పథకంలో పని చేసే వేతనదారుల జాబ్‌కార్డులతో ఆధార్ అనుసంధానం చేస్తున్నాం. దాదాపు ప్రక్రియ పూర్తి కావచ్చింది. మండలంలో ఇంకా దాదాపు 3వేలమందికి అనుసంధానం చేయాల్సి ఉంది. ఇందుకోసం గ్రామ పంచాయతీల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. ఉపాధి హామీ పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేయాలనేదే దీని ఉద్దేశం.
– కె.ధర్మారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో, అనకాపల్లి

తుమ్మపాల ఉపసర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం



సంతోష్ కుమార్‌కు ధ్రువ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి ధర్మారావు

అనకాపల్లి రూరల్: తుమ్మపాల మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్‌గా సదరం విజయ వెంకట సంతోష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉపసర్పంచ్‌గా ఎన్నికైన మొగసాల లక్ష్మి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో, ఈ పదవి ఖాళీ అయింది. దీంతో పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ధర్మారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సర్పంచ్‌తో పాటు 19మంది సభ్యులుండగా 16మంది హాజరయ్యారు. మొగసాల లక్ష్మి తాజా మాజీ ఉప సర్పంచ్, 12వ వార్డు సభ్యుడు సంతోష్‌కుమార్ పేరును ప్రతిపాదించగా, 11వ వార్డు సభ్యురాలు గోవిందమ్మ బలపరిచారు. ఇంకెవ్వరూ పోటీలో లేకపోవడంతో సంతోష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన ఎన్నికల అధికారి, ఆయనకు ధ్రువపత్రం అందించారు. సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ గాంధీ, పీలా విశ్వేశ్వరరావు, విల్లూరి సూర్యకుమారి, విల్లూరి శేఖర్, ఎంపీటీసీ పన్నీరు వెంకటలక్ష్మి, రైతు సంఘం నాయుడు పీలా బుజ్జి తదితరులు ఉప సర్పంచిని అభినందించారు. అనకాపల్లి పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆత్మీయ సత్కారం



శివఅప్పారావును సత్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: బెల్లం మార్కెట్ యార్డులో కార్మికులు సమష్టిగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వం, రైతులు, అధికారుల మన్ననలను పొందాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన యార్డు కార్మిక సంఘం అధ్యక్షుడు పాలిమేర శివఅప్పారావును స్థానిక రింగ్‌రోడ్డులోని దాడి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ 18 పర్యాయాలు సంఘం కార్యదర్శిగా, మూడు పర్యాయాలు అధ్యక్షునిగా ఎన్నికైన శివ అప్పారావు కార్మికుల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 80, 81 వార్డుల కార్పొరేటర్లు పీలా లక్ష్మీసౌజన్య, కొణతాల నీలిమ, 80, 81 వార్డుల ఇన్‌చార్జిలు కొణతాల భాస్కరావు, పీలా రాంబాబు, పార్టీ నేత దాడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి

అనకాపల్లిటౌన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌ఈఈడీఏపీ సంస్థల ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా అచ్యుతాపురంలోని ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 27సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. డిప్లొమా, బీటెక్ (మెకానికల్, ప్రొడక్ట్, ఆటోమొబైల్) చేసిన నిరుద్యోగులకు శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలియజేశారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు రెండు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామని, మూడో బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 70363 63272, 90147 70309 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

7,8 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

అనకాపల్లిటౌన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7, 8 తేదీల్లో స్థానిక కార్మిక–కర్షక నిలయంలో జిల్లా మహాసభలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణ తెలిపారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, నక్కపల్లి డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జిల్లాలో మిగిలిన మండల ప్రధాన కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. విశ్వవిద్యాలయాలకు, గిరిజన యూనివర్సిటీలకు కేంద్ర ప్రభుత్వం తక్కువ బడ్జెట్ కేటాయించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గొర్లి తరుణ్, బాబ్జి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి



అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న ఎస్‌వో మోహనరావు

కశింకోట: వచ్చే నెలలో, ఉగాది రోజు వైఎస్సార్ జగనన్న ఇళ్ల కాలనీలో భారీగా గృహ ప్రవేశాలు జరగాల్సి ఉందని మండల ప్రత్యేక అధికారి బి.మోహనరావు తెలిపారు. ఈ నేపథ్యంలో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిసెంట్లను ఆయన ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో జగనన్న ఇళ్ల కాలనీల్లో గృహ నిర్మాణాల పరిస్థితిపై శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగాది నాటికి అత్యధికంగా గృహ నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీఈవో కొంకి అప్పారావు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాఘపౌర్ణమికి ముత్యాలమ్మపాలెం తీరంలో ఏర్పాట్లు

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామంలో మాఘ పౌర్ణమి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. పుణ్య స్నానాలు ఆచరించడానికి వీలుగా తీర ప్రాంతాన్ని ముస్తాబు చేశారు. మాఘపౌర్ణమి పురస్కరించుకుని భక్తులు శనివారం రాత్రి జాగరణ చేసి ఆదివారం సూర్యోదయాన సముద్ర స్నానాలు ఆచరించి, సమీపంలో కొలువుదీరిన మాధవస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

ఆలయం ముస్తాబు

తీర్థ మహోత్సవంలో భాగంగా మాధవస్వామి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, తోరణాలతో అలంకరించారు. గ్రామ ప్రధాన కూడలి నుంచి తీరం వరకు లైటింగ్ ఏర్పాటు చేశారు. జాగరణ చేసే భక్తుల కోసం తీరంలో శనివారం రాత్రికి మాధవస్వామి యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుల సహకారంతో విశాఖ డ్యాన్స్‌బేబీడాన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. 'అదే రాత్రి టీడీపీ సహకారంతో డ్యాన్స్ ధమాకా కార్యక్రమం నిర్వహించనున్నారు. 'ముత్యబంగారమ్మ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో బుర్రకథ ఏర్పాటు చేశారు. 'ఆదివారం ఉదయం స్నానాల ఘట్టాల వద్ద గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు సహకారంతో డ్యాన్స్ ధమాకా కార్యక్రమం నిర్వహించనున్నారు.

- సుదూర ప్రాంతాల నుంచి సముద్ర స్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తుల కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను నిలపడానికి పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.
- భక్తులకు మంచినీరు, ఉచిత ప్రసాదాలు అందించనున్నారు.

పటిష్ట బందోబస్తు

పట్టణ, పల్లె ప్రాంతాల నుంచి సముద్ర స్నానాలకు వచ్చే భక్తుల కోసం స్టీల్‌సిటీ డిపో నుంచి అదనపు సిటీ బస్సులు నడపడానికి ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. స్నాన ఘట్టాల వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కనకప్పారావు చెప్పారు. తీరంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు.

కళా తపస్వికి ఘన నివాళులు



గవరపాలెం పార్కు సెంటర్ వద్ద కె.విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు



కశింకోటలో విశ్వనాథ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు

తుమ్మపాల: తెలుగు సినీ పరిశ్రమ గర్వించదగ్గ దర్శకుడు, కళామతల్లి ముద్దుబిడ్డ కె.విశ్వనాథ్‌కు అనకాపల్లి పట్టణంలో అభిమానులు ఘన నివాళులర్పించారు. తెలుగు సినీ పరిశ్రమ దర్శక దిగ్గజాన్ని కోల్పోయిందని వక్తలు పేర్కొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చిత్రాలన్నీ దృశ్య కావ్యాలని, అటువంటి దర్శకుడు లభించడం తెలుగు సినీ పరిశ్రమ చేసుకున్న అదృష్టమని కొనియాడారు.

- కళాతపస్వి కె.విశ్వనాథ్ మరణం చలనచిత్ర రంగానికి తీరని లోటని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. గవరపాలెం పార్కు సెంటర్ వద్ద ఉత్తరాంధ్ర నాగార్జున ఫ్యాన్స్, సినీ అభిమానుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కె.విశ్వనాథ్ సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. 2012లో అనకాపల్లిలో కొణతాల రాజేంద్ర షాపునకు ఆయన వచ్చారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు మళ్ళ సురేంద్ర, వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు పి.చందు, విశ్రాంత ప్రిన్సిపాల్ బుద్ధ అప్పారావు, ఆడారి రామకృష్ణ ఎస్.భానుచందర్, మళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆయన చిత్రాలు ఆణిముత్యాలు

కశింకోట: కశింకోటలోని అగ్రహారం వీధిలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కళా తపస్వి కె.విశ్వనాథ్‌కు ఘనంగా నివాళులర్పించారు. విశ్వనాథ్ సంస్మరణ సభను నిర్వహించి, ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వేదుల వెంకట శాస్త్రి మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, సంస్కృతి సంప్రదాయాలను మేళవించిన ఆణిముత్యాలాంటి చిత్రాలను తీసి, వాటి గొప్పతనాన్ని జగత్తుకు చాటిన అద్భుత దర్శకుడని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు అవసరాల సీతా కామేశ్వరి, కార్యదర్శి ఎం. కిషోర్‌కుమార్, వార్డు సభ్యుడు కె. సురేష్, ప్రతినిధులు అవసరాల నాగేశ్వరరావు, గుళ్లేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ డైరీని కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి శుక్రవారం ఆవిష్కరించారు. వార్షిక డైరీతో పాటు యూనియన్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

సంపద కేంద్రం పరిశీలన



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పారావు

కశింకోట: కశింకోటలోని సంపద కేంద్రాన్ని ఎంపీడీవో కొంకి అప్పారావు శుక్రవారం పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు చేసి వర్మీ కంపోస్టు ఎరువు ఎక్కువగా ఉత్పత్తి కావడానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అక్కడ తయారవుతున్న వర్మీ కంపోస్టు ఎరువును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్. రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణ పతక విజేతకు అభినందన



జోష్నను అభినందిస్తున్న కోచ్ గుండ్రపు నీలా

అనకాపల్లిటౌన్: కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ (పవర్ లిఫ్ట్) పోటీల్లో స్థానిక చైతన్య హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని ఎ.జోష్న బంగారు పతకం సాధించింది. 52 కేజీల విభాగంలో స్క్వాడ్–140 కేజీలు, బెంచ్‌ప్రెస్–75 కేజీలు, డెడ్ లిఫ్ట్–145 కేజీల బరువు ఎత్తి బంగారు పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా ఆమెను కోచ్ గుండ్రపు నీలా శుక్రవారం అభినందించారు.

డీఆర్వోకు వినతి



డీఆర్వో వెంకటరమణకు వినతి పత్రం అందిస్తున్న సంఘం నాయకులు

తుమ్మపాల: రాష్ట్ర ప్రభుత్వం ఫేస్‌యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో డీఆర్వో పి.వెంకటరమణకు వినతిపత్రం అందించారు. సమయపాలన లేని విధినిర్వహణలో ఫేషియల్ అటెండెన్స్‌తో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, డ్రైవర్, చైన్‌మెన్ పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వీఆర్ఏల సంఘం ప్రధాన కార్యదర్శి కె.లోవరాజు, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఎంపీఎఫ్‌సీ గొడౌన్ పరిశీలన



ఎంపీఎఫ్‌సీ గొడౌన్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే

కశింకోట: వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉంచడానికి మండలంలోని జమాదులపాలెం గ్రామంలో రూ.40 లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన ఎంపీఎఫ్‌సీ (మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్)ను మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే శుక్రవారం పరిశీలించారు. అవసరమైతే గొడౌన్‌లో విభజన గోడ నిర్మించాలని సూచించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, డైరెక్టర్ గొంతిన శివబాబు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు 'పశు విజ్ఞాన బడి'



పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు విజ్ఞాన బడి ప్రత్యేక అధికారి డాక్టర్ మురళీధర్

కశింకోట: పరిశుభ్రమైన పాలను అందించడంపై రైతులు దృష్టి నిలపాలని విశాఖపట్నం పశు విజ్ఞాన బడి ప్రత్యేక అధికారి, స్మైల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మురళీధర్ కోరారు. పాడి రైతులకు × పశు విజ్ఞాన బడి₹ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతలపాలెం రైతు భరోసా కేంద్రంలో పరిశుభ్రమైన పాల ఉత్పత్తి–దానివల్ల కలిగే ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రమైన పాల ఉత్పత్తికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పాలకు గిట్టుబాటు ధర లభించడం లేదని పలువురు రైతులు పేర్కొనగా, ప్రభుత్వం ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న అమూల్ కేంద్రాలకు పాలను సరఫరా చేస్తే గిట్టుబాటు ధర లభించగలదని జగనన్న పాల వెల్లువ నోడల్ అధికారి పి.భానుబాబు బదులిచ్చారు. సర్పంచ్ కొట్టి రాము, పశు వైద్యాధికారులు ఆల్ఫాన్సా జార్జి, చైతన్యమణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆరోగ్యశ్రీ కౌంటర్



ఆరోగ్యశ్రీ కౌంటర్

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆరోగ్యశ్రీ కౌంటర్ అందుబాటులోకి వచ్చింది. శస్త్రచికిత్సలు అవసరమైన రోగులు కౌంటర్‌లో సంప్రదిస్తే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యానికి సలహాలతో కూడిన వైద్యానికి ప్రక్రియ పూర్తి చేస్తామని వైద్యాలయ సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వర్తించినట్లయితే రోగి వివరాలు కౌంటర్‌లో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. చికిత్స అనంతరం జీవనభృతి, రోగుల సౌకర్యార్థం 104, 108 సేవలు ఏర్పాటు చేశామన్నారు.

సర్వీస్ రోడ్డులో ప్రమాదాలకు చెక్

- జేసీ కల్పనాకుమారి చొరవతో తక్షణ చర్యలు
- స్పీడ్‌బ్రేకర్లను గుర్తించేలా తెలుపు రంగు



సర్వీస్ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లకు తెలుపు రంగు వేస్తున్న సిబ్బంది

తుమ్మపాల: అనకాపల్లి–సబ్బవరం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ప్రధాన కూడళ్లలో ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టారు జాతీయ రహదారి విభాగం సిబ్బంది. జేసీ కల్పనాకుమారి ఆదేశాల మేరకు ఇక్కడి స్పీడ్‌బ్రేకర్లకు శుక్రవారం తెలుపురంగు వేసి, ప్రయాణికులు స్పీడ్‌బ్రేకర్లు గుర్తించేలా ఏర్పాటు చేశారు. వివరాలివి.. ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా అనకాపల్లి నుంచి రేబాక, కాపుశెట్టివానిపాలెం, కోడూరు, బాటజంగాలపాలెం గ్రామాల ప్రధాన కూడళ్లలో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేశారు. కాని వాటిని ప్రయాణికులు గుర్తించేలా మధ్యలో తెలుపు రంగు వేయకపోవడంతో స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనాలు అదుపు తప్పి, ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం రేబాక జంక్షన్‌లో స్పీడ్‌బ్రేకర్ కారణంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న భార్యభర్తలు ప్రమాదానికి గురయ్యారు. అటుగా వస్తున్న జేసీ కల్పనా కుమారి క్షతగాత్రులను గుర్తించి, తన కారులో సబ్బవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. ప్రమాదానికి కారణం స్పీడ్‌బ్రేకర్లేనని తెలుసుకుని, వాటిని గుర్తించేలా ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి విభాగం అధికారులకు ఆదేశాలు చేశారు. దీంతో సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు.